

'మీ కోసం' వెబ్‌సైట్‌లోనూ అర్జీల నమోదు

పార్వతీపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలపై మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మాఫీ.. హ్యాపీ!



జియ్యమ్మవలస మండల పరిధిలో వట్టిగెడ్డ ప్రాజెక్టు కుడి కాలువ ఇలా..

- నీటి తీరువా బకాయిలపై వడ్డీ మాఫీ
- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- 2019 నుంచి కనిపించని వసూళ్లు
- దృష్టి సారించని అధికారులు
- ప్రాజెక్టులు, కాలువల నిర్వహణపై ప్రభావం

జియ్యమ్మవలస, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి రావాల్సిన నీటి తీరువా బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ ఇటీవల జీవో జారీ చేసింది. జిల్లాలో జాయింట్ ఎల్‌పీఎంలు కలుపుకుని మొత్తం నీటి తీరువా బకాయి రూ.11.57 కోట్లుగా ఉంది. పార్వతీపురం డివిజన్‌లో నీటి తీరువా బకాయి రూ.3.59 కోట్లు ఉండగా.. ప్రభుత్వం నిర్ణయించిన ఆరు శాతం ప్రకారం రూ. 17.15 లక్షల మేర వడ్డీ మాఫీ చేయాల్సి ఉంది. అదేవిధంగా పాలకొండ డివిజన్‌లో రూ.8.02 కోట్లు బకాయిల్లో వడ్డీ రూ. 40.34 లక్షలు మాఫీ చేయాలి.

నిధుల వినియోగం ఇలా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ ఎకరాకు రూ. 200 చొప్పున రెవెన్యూశాఖ రైతుల వద్ద నుంచి వసూలు చేయాలి. ఇందులో 95 శాతం (అంటే రూ. 190లు) ప్రాజెక్టుకు, మిగిలిన 5 శాతం (అంటే రూ. 10లు) సంబంధిత పంచాయతీకి జమ చేయాల్సి ఉంది. ప్రాజెక్టులకు జమ చేసిన 95 శాతం నిధుల్లో 60 శాతం నిధులు నీటి సంఘాలకు, 35 శాతం నిధులు ప్రాజెక్టు కమిటీకి ఇవ్వాల్సి ఉంది. నీటి సంఘాలకు ఇచ్చిన 60 శాతం నిధులతో ప్రాజెక్టు పరిధిలో నీటి పారుదలశాఖ ఆపరేషన్స్ అండ్ మెంటైనెన్స్ (ఓఅండ్ఎం) పనులు చేయాలి. అంటే కాలువల లైనింగ్ శుభ్రం చేయడం, పూడిక, మట్టి తీత పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగు నీరందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నీటి పారుదల శాఖపై ఉంది. నీటి సంఘాలకు అందే నిధుల్లో 10 శాతం పరిపాలనా విస్తరణకు ఉపయోగించాలి. అంటే అవసరమైన లస్కర్లను నియమించుకునే వీలుంది.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం డివిజన్‌లో సాలూరు, మక్కువ, పాచిపెంట, సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 140 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 71,328 ఖాతాలు ఉన్నాయి. అయితే సీతానగరం నుంచి రూ. 33,516 వరకు వసూలు అవగా.. మిగతా మండలాల నుంచి రూపాయి కూడా వసూలు కాలేదు. ఇంకా ఈ డివిజన్ నుంచి రూ.3.59 కోట్లు రావాల్సి ఉంది.
- పాలకొండ డివిజన్‌లో సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 139 రెవెన్యూ గ్రామాలు, 68,822 ఖాతాలు ఉన్నాయి. జియ్యమ్మవలస మండలంలో రూ. 5,158, భామినిలో రూ.10,983, పాలకొండలో రూ. 5,438, వీరఘట్టంలో రూ.8,510 చెల్లించినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇదికాకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో రైతులు చెల్లించినది రూ.16,113. ఇంకా రూ.8.02 కోట్లు చెల్లించాల్సి ఉంది.
- పార్వతీపురం డివిజన్‌లో 8 మండలాల మొత్తం నీటి తీరువా బకాయి రూ. 3.59 కోట్లు ఉండగా.. జియ్యమ్మవలస మండలం నీటి తీరువా మొత్తం బకాయి రూ. 3.26 కోట్లుగా ఉంది. ఆ తరువాత స్థానంలో పాలకొండ మండలం రూ. 2.47 కోట్లు, వీరఘట్టం రూ. 1.90 కోట్ల బకాయిలుతో ఉన్నాయి. ఈ బకాయి వసూళ్ల విషయంలో ఈ మూడు మండలాల రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- నీటి తీరువా విషయంలో జాయింట్ ఎల్‌పీఎంల ద్వారా వసూలు చేయాల్సిన నిధులు అదనం. జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్న రెవెన్యూ గ్రామాలు పార్వతీపురం డివిజన్‌లో 62, పాలకొండ డివిజన్‌లో 40 గ్రామాలు ఉన్నాయి. వీటికి సంబంధించి 23,115 ఖాతాలు ఉన్నాయి. మొత్తం నీటి తీరువా బకాయి రూ. 12.17 కోట్లుగా ఉంది.

అధికారుల నిర్లక్ష్యం..

నీటి తీరువా అనేది ప్రాజెక్టుల నిర్వహణకు అత్యంత ముఖ్యమైన నిధి. ప్రాజెక్టుల్లో చిన్న చిన్న పనులు చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి ఈ నిధులు ఎంతగానో దోహదప డతాయి. అయితే ఏటా రైతుల వద్ద నుంచి నీటి (మిగతా 8వ పేజీలో..)



గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ వద్ద వాటర్‌ఫాల్స్

పర్యాటకంపై నిర్లక్ష్యం

- ప్రతిపాదనలకే పరిమితమైన అభివృద్ధి
- జిల్లాలో ఎన్నో అందమైన ప్రదేశాలు
- అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయం
- ఉద్యోగ, ఉపాధి మెరుగుపడే అవకాశం
- ప్రభుత్వం దృష్టిసారించాలని జిల్లా వాసుల విన్నపం

పార్వతీపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక రంగమే ప్రధాన ఆదాయ వనరు. నాలుగు నియోజకవర్గాల్లో కూడా జలపాతాలు, ఎత్తయిన గిరులు, సాగు నీటి ప్రాజెక్టులు ఇలా ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నాయి. కానీ, పాలకులు మాత్రం పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లా ఏర్పడి నాలుగేళ్లు దాటుతున్నా పర్యాటకాన్ని పట్టించుకోవడం లేదు. కేవలం ప్రతిపాదనలకే అభివృద్ధి పరిమితమవుతుంది. జిల్లాలోని 15 మండలాల్లో అత్యధిక మండలాలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలను గతంలో, ప్రస్తుతం అధికారులు రూపొందించారు. అదే విధంగా పెద్దగడ్డ రిజర్వాయర్, వెంగళరాయ సాగర్, తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అడుగులు ముందుకు పడడం లేదు. దీనికి ప్రధాన కారణం నిధులు మంజూరు కాకపోవడమే. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఉంటాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పాచిపెంట మండలం పెద్దగెడ్డ రిజర్వాయర్ వద్ద బోటు షికారుతో పాటు పర్యాటకులకు రాత్రి వసతి, కిడ్స్ జోన్ తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు రూ.2కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ, నిధులు మాత్రం మంజూరు కాలేదు. మక్కువ మండలం వెంగళరాయ సాగరం వద్ద రాక్ గార్డెన్, ఫ్రీ హోటల్, వెడ్డింగ్ ప్లాట్‌ఫారం తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు రూ.2కోట్లతో, సాలూరు మండలంలోని కొదమ, లొద్ద, తోనాము, దండిగాము తదితర ప్రాంతాల్లో ఉన్న వాటర్‌ఫాల్స్‌కు పర్యాటకులు వెళ్లేందుకు రహదారులతోపాటు ఆ ప్రాంతాల్లో రూఫ్‌వే, డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.కోటితో, కురుపాం నియోజకవర్గంలో తోటపల్లి రిజర్వాయర్ వద్ద టూరిస్ట్ కాటేజీలతో పాటు రాత్రి వసతి కోసం, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు రూ.2కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు వెళ్లాయి. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ వాటర్‌ఫాల్స్ వద్ద పిక్నిక్ స్పాట్‌కు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ మరుగుదొడ్లు, నడక వంతెన మౌలిక వసతులు ఏర్పాటు కోసం రూ.75 లక్షలు అవసరమని గుర్తించారు. ఇదే మండలంలో సవరకోటపాడు వద్ద అడ్వంచర్‌పార్క్ అభివృద్ధి చేపడితే పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందనే ఆలోచనతో స్విమ్మింగ్ పూల్స్, టూరిస్ట్ కాటేజ్‌స్ తదితర వాటి నిర్మాణం కోసం 1.50కోట్లు అవసరమని అధికారు లు ప్రతిపాదనలు చేశారు. సీతంపేట మండలంలో (మిగతా 8వ పేజీలో..)



గుమ్మలక్ష్మీపురం మండలం సవరకాటపాడు అడ్వంచర్ పార్క్

గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

- వారి ఆచారాలు, సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత
- మంత్రి సంధ్యారాణి
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం సాలూరులో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోసుబొమ్మ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు గిరిజనులతో కలిసి మంత్రి సంధ్యారాణి ర్యాలీ నిర్వహించారు. తమ సంప్రదాయ మేళ తాళాలు, థింసా నృత్యాలతో గిరిజనులు అలరించారు. ఈ ర్యాలీలో ఆదివాసీ ఐక్యత మన బలం, గిరిజన గౌరవం-గిరిజన హక్కులు వంటి నినాదాలు చేశారు. అనంతరం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, భాష, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. గిరిజనవిద్యార్థుల కోసం వసతి గృహాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల
దత్తత స్వచ్ఛందమే

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బంగారు కుటుంబాల దత్తత స్వచ్ఛందమేనని, మార్గదర్శిల అభీష్టమే తుది నిర్ణయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. పీ-4 కింద బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు కుటుంబాల దత్తతపై ఎటువంటి ఒత్తిడి ఉండబోదని, ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చిన వారినే మార్గదర్శిగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, దానిని తూ.చా తప్పకుండా పాటించాలని అధికారులకు హితవు పలికారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవచ్చునని పిలుపునిచ్చారు. ఈ నెల 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను ఈ నెల 10లోగా సాధించాలని అధికారులను ఆదేశించారు. దత్తత తీసుకోబోయే మార్గదర్శిలకు చాలా వరకు సందేహాలు ఉంటాయని, వాటిని నివృత్తి చేసి ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో అధికారులపై ఎటువంటి ఒత్తిడి ఉండబోదని, మానవతా దృక్పథంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా ఉత్తేజపర్చడమే అధికారుల లక్ష్యమని కలెక్టర్ వివరించారు.



దురుబిలి గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు

దురుబిలిలో ఏనుగుల బీభత్సం

- పైపులైన్లు, సోలార్ పలకలు ధ్వంసం
- భయాందోళనలో గిరిజనులు



ధ్వంసమైన పైపులైన్లు

కురుపాం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఏనుగులు గుంపు దురుబిలి గ్రామస్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నా యి. భయానికి స్థానికులు నివాసం ఉంటున్న పాకల వైపు వెళ్లడం మానేశారు. అటవీశాఖ సిబ్బంది హెచ్చరించడంతో పొలాలవైపు వెళ్లేందుకు గిరి జనులు వెనుకంజ వేస్తున్నారు. తాజాగా ఆదివారం ఏనుగుల గుంపు దురుబిలి గ్రామానికి చెందిన పువ్వల చంటి పొలంలోని సోలార్ పలకలు, పైపులైన్లను ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన వరినారు మళ్లను, కూరగాయల పెరటితోటలను నాశనం చేశాయి. కవ్వింపు చర్యలు చేపట్టకూడదంటూ అటవీ సిబ్బంది గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం

- మంత్రి సంధ్యారాణి
- వెంగళరాయసాగర్ నుంచి నీరు విడుదల

8లో

తగ్గిన నిమ్మ ధర

- బస్తా కాయలు రూ.600

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

- స్నానం కోసం నదికి వెళ్లి విద్యార్థి మృతి

7లో

ఉద్యమమే జీవితంగా.. పాటే ఊపిరిగా

- బతికిన వంగపండు ప్రసాదరావు
- విలువలకు కట్టుబడి జీవన పోరాటం
- ఉద్యోగం వదిలి విప్లవ సంగీతంలోకి
- 'జననాట్య మండలి'తో ప్రజల్లో చైతన్యం
- నేడు వర్ధంతి



పార్వతీపురం/రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి)

ఆయన గజ్జెకట్టి ఆడిపాడితే ఎవరైనా చూస్తూ ఉండిపోవాల్సిందే. ఉద్యమమే జీవితంగా.. పాటే ఊపిరిగా జీవించారాయన. సిక్కోలు నక్సల్‌బరి ఉద్యమాన్ని తన గీతాలతో ఉరకలెత్తించారు. ఆయన ఆలపించిన ఏం పిల్లడో ఎల్దమొస్తవా.. వంటి ఎన్నో పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. నమ్మిన సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి జీవనపోరాటం చేశారు. ప్రజా ఉద్యమానికి, కళా విప్లవానికి ఆయన జీవితం మార్గదర్శకం. తెలుగు జానపద విప్లవ సంగీత ప్రపంచంలో చిరస్మరణీయ వ్యక్తిగా నిలిచారు. ఆయనే ప్రజా గాయకుడు, వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు. సోమవారం వంగపండు వర్ధంతి సదర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- వంగపండు ప్రసాదరావు 1943 జూన్‌లో పార్వతీపురం మండలం పెద బొండపల్లి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు జగన్నాథంనాయుడు, చినతల్లి. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె వంగపండు ఉష ప్రముఖ జానపద గాయనిగా పేరుపొందారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలోని వైకేఎం కాలనీలో వంగపండు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఆయన జీవితంలో సింహభాగం విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో గడిచింది. అదేవిధంగా హైదరాబాద్‌లో గద్దర్‌తో ఎక్కువగా ఉండేవారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డులో 1976 నుంచి 99 వరకు ఉద్యోగం చేశారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా, ఆరేళ్లకు పైగా సర్వీసు ఉన్నా.. షిప్‌యార్డు ఉద్యోగానికి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి పాటే ఊపిరిగా పని చేశారు.
- జననాట్య మండలి స్థాపనలో వంగపండుది కీలకపాత్ర. 1972లో జననాట్య మండలి స్థాపనలో గద్దర్‌తో పాటు బి.నరసింగరావు సహకారం తీసుకున్నారు ఆయన. జననాట్య మండలి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం తదితర అంశాలపై కాళ్లకు గజ్జెలు కట్టి ఆడిపాడుతూ, ప్రజలను ఉత్తేజపరుస్తూ ప్రదర్శనలు నిర్వహించేవారు. తెలుగు, హిందీ తదితర భాషల్లో 400 పైగా పాటలు పాడిన చరి త్ర వంగపండుకు ఉంది. అనేక సినిమాలకు పాటలు రాయడంతో పాటు వాటిని ఆలపించారు. 'యంత్రమెట్ల నడుస్తుందంటే', 'జజ్జనకర జనారే.. జనక జన జనారే', 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా', నాంపల్లి స్టేషన్ కాడ రాజాలింగో వంటి పాటలు ఆయనకు (మిగతా 8వ పేజీలో..)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగుగంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్ పనుల నిమిత్తం పందిరప్పన్నజంక్షన్, ఏపీ హోమ్స్, రామ్‌నగర్, చెరకు కాటా, రైల్వే సేషన్‌రోడ్డు, ఎంకేరావు కాలనీ, సబ్‌స్టేషన్ ఏరియా, దేవిజంక్షన్‌ఏరియా, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వాసుపత్రి, బర్మా కాలనీ, పుణ్యగిరికాలనీ, రేగపుణ్యగిరి, అయ్యప్ప లే అవుట్, పుణ్యగిరిఏరియాలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పదో తేదీన పాటల పోటీలు

రాజాం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ఈనెల పది నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మెగా స్టార్ చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు కొండలరావు తెలిపారు.ఆదివారం రాజాంలో వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తేదీన ఘంటసాల సంగీత కళాశాల సహకారంతో చిరంజీవి అభిమాన సంఘం పర్యవేక్షణలో ఉత్తరాంధ్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, కె.జనార్దనరావు, సాయి ప్రశాంత్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

16 నుంచి సేవా కార్యక్రమాలు

విజయనగరం కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి పురస్కరించుకుని ఆగస్టు 16 నుంచి నవంబరు 23 వరకూ వంద సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రాథో చెప్పారు. ఆదివారం విజయనగరంలోని ఉడాకాలనీలో సత్యసాయి సేవా సమితి సమావేశమందిరంలో జిల్లా పదాధికారులు, సమితి పదాధికారులు, భజన మండలి కన్వీనర్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా సునీల్‌కుమార్ రాథో మాట్లాడుతూ నవంబరు 23న సత్యసాయిబాబా శతజయంతి పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వేద కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లు

చీపురుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరీ ఇంటర్ ప్రథమసంవత్సరం ఐఐటీలో 16 సీట్లు, నీట్‌లో 19 సీట్లు, పదో తరగతిలో మూడు, ఐదో తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు, అడ్మిషన్ల కోసం తమ ఆధార్, రేషన్ కార్డులతో కళాశాల పనివేళల్లో రావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 8309361345 నంబరుకు సంప్రదించాలని ఆమె కోరారు.

చదరంగం పోటీలు

విజయనగరం గంటస్తంభం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయ నగరంలోని కొత్త అగ్రహారంలోగల శ్రీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి అండర్-19 చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఏర్పాటుచేశారు.విజేతలకు శ్రీచెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీప రావు, సీఐ మంగవేణి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో టోర్నమెంట్ డైరక్టరు తిరుపతిరావు పాల్గొన్నారు.

రాజాంలో స్నేహితుల దినోత్సవం

రాజాం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాజాంలోని సాయినగర్‌లోగల సాయి నిలయం ఆవరణలో స్నేహితుల ఆదివారం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్‌ఆధ్వర్యంలో బొద్దాం గ్రామానికి చెందిన శాస్త్రవేత్త, రొటేరియన్ రఘుపాత్రుని భీమారావును సన్మానించారు.ఈ కార్యక్రమంలోరాజాం రోటరీక్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, క్లబ్ కార్యదర్శి సప్పటి వసంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బొండపల్లి,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగసింగిపేటలో 2024-25 సంవత్సరంలో గజపతినగరంలోని ప్రభుత్వ బాలబాలికల ఉన్నతపాఠశాలల్లో స్నేహితుల దినోత్సవం సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్నేహహస్తం సొసైటీ సభ్యులు నగదుప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. బాలుర పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జి.కిశోర్‌కు రూ.ఐదు వేలు, పి.సాత్విక్‌కు రూ.మూడువేలు, బి.త్రినాథ్‌కు రెండు వేలు, బాలికలహైస్కూల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు మార్కులు సాధించిన జి.లిఖిత, పి.ప్రశాంతి, జి.దేవిలకు నగదు ప్రోత్సాహకాలు సభ్యులు అందజేశారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ

కొత్తవలస, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి పంచాయతీ వినాయకనగర్‌లోగల షర్‌డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒంటరిగా నివాసముంటున్న 45 మంది వృద్ధులకు 12 రకాల నిత్యావసరాలను పంపిణీ చేశారు. సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, జనసేన నాయకుడు పిల్లా రామ దుర్గ స్వరూప్, రైల్వే రిటైర్డు ఉద్యోగి రమణ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డు ఉద్యోగి ఎస్.జితేంద్రకుమార్ ఆర్థిక సాయంతో నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు ట్రస్టుచైర్మన్ హరికుమార్ తెలిపారు.

నిర్వహణ లేక.. నిరుపయోగంగా మారి

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- ఇదీ రాజాంలోని సీహెచ్‌సీ, మునిసిపల్ కార్యాలయాల వాహనాలు, పరికరాల పరిస్థితి



మునిసిపల్ కార్యాలయం ఆవరణలో దిష్టిబొమ్మలా వాటర్ ట్యాంక్



సామాజిక ఆసుపత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న సంచార వైద్యవాహనాలు

రాజాం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజావసరాల కోసం కొనుగోలు చేసిన వాహనాలు, పరికరాలు నిరుపయోగంగా మారాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో రోగుల వైద్య అవసరాలను తీర్చేందుకు వీలుగా లక్షలాది రూపాయలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన సంచార వైద్యశాలల వాహనాలు ఏడాదిగా రాజాం సామాజిక ఆసుపత్రి ఆవరణలో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండి వాన కు తడవడంతో కాలక్రమంలో స్క్రాప్ కింద అమ్మేందుకు కూడా పనికిరాని పరిస్థితి నెలకొంది. అలాగే వివిధ పనుల కోసం వచ్చిన వారి దాహార్తిని తీర్చేందుకు రాజాం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ట్యాంక్ ఏడాదిగా మూలకుచేరింది. దీని ఏర్పాటు కోసం సుమారు రూ.50 వేల వెచ్చించారు. ఇదే కార్యాలయానికి చెందిన ఎక్స్‌కవేటర్ సైతం వినియోగంలో లేకపోవడంతో సామాజిక ఆసుపత్రి ఆవరణలో ఎండకు ఎండి వానకు తడుస్తోంది. తక్షణమే అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

బాధితులను ఆదుకోవడంలో ముందుంటాం

- ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేస్తున్న కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ సెర్ప్, ఎంఎస్‌ఎంఈ సెర్ప్ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబందించిన చెక్కులను లబ్ధిదారులకు మంత్రి శ్రీనివాస్ అందజేశారు.గంట్యాడ మండలంలోని రేగుబిల్లి గ్రామానికి చెందిన కంచి పద్మావతికి రూ 1,16,414, గజపతినగరం మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన పట్నాన్ సురేష్ కుమారుడు సూర్య స్వాతిక్‌కు రూ.48,401 చెక్కును పంపిణీచేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సీఎం చంద్రబాబునాయుడు రాసిన లేఖను బాధితులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలోని నాయకులు, లబ్ధిదారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నివిధాలుగా రైతులకు సహకరించండి

- చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



మాట్లాడుతున్న కళావెంకటరావు

గుర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులకు అన్ని విధాలుగా సహకరించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. ఆదివారం తెట్టంగిలో పీఏసీఎస్ చైర్మన్‌గా తిరుమలరాజు కిరణ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ సొసైటీని మరింత అభివృద్ధిచేసి రాష్ట్రంలోని ఉన్నతమైన స్థాయికి తీసుకురావాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ రైతుల కోసం టీడీపీ ఎల్లవేళలా పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో బీజేపీజిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, టీడీపీ నాయకులు కేటీఆర్, వెన్ని సన్యాసినాయుడు, సీహెచ్ మహేశ్వరరావు, సన్యాసినాయుడు, కామునాయుడు, పైల బలరాము, తాడ్డి చంద్రశేఖర్, సంచాన సన్యాసినాయుడు, పిల్లా అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకోడానికే వైసీపీ విమర్శలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పార్టీని పూర్తిగా మరిచిపోయే పరిస్థితి వచ్చిందని, ఈ పరిస్థితుల్లో తమ ఉనికిని కాపాడుకోడానికే వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సుమారు 80 శాతం ఇప్పటికే అమలుచేసినట్లు తెలిపారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ పథకాలు అమలయ్యాయని చెప్పారు. ఈనెలలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ప్రజలు సంతృప్తి చెందుతున్నారని, అయితే, వైసీపీ నాయకులు మాత్రం అబద్ధాలు మాట్లాడుతూ, ప్రభుత్వంపై బురద జల్లడానికి చూస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని మాయలు చేసినా, నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని నాగార్జున అన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు, ఎటువంటి హామీలు ఇవ్వకపోయినా, గత ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని నిర్ణయించుకున్నారని, ఈ విషయాన్ని ఇప్పటికైనా వైసీపీ నాయకులు గ్రహించాలని నాగార్జున కోరారు.

విజయనగరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోగల 32, 33, 34 డివిజన్లలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతోపాటు ఆయా డివిజన్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. తొలుత ఏడాదిలో నియోజకవర్గం పరిధిలోని చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యేక స్క్రీన్‌పై వీడియోల ద్వారా వివరించారు.

రేపు విద్యుత్ భవనం వద్ద ధర్నా

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అదానీ విద్యుత్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు వద్దని మంగళవారం విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రజావేదిక నాయకుడు రెడ్డి శంకరరావు తెలిపారు. ఆదివారం విజయనగరంలోని గురజాడనగర్‌లో జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలల కాలంలో 18,600 కోట్ల రూపాయలు విద్యుత్ భారాలు వేశారన్నారు. మరోసారి రూ.1200 కోట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. కాలనీల్లో పేదల ఇళ్లకి అపార్టమెంట్లల్లో అదానీ విద్యుత్ మీటర్లు బిగించేందుకు ఇప్పటికే వస్తున్నారనివస్తే, అడ్డుకుని తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో రమణమ్మ, బంగారం, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గృహలకు స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు ప్రయత్నిస్తోందని, పాతమీటర్లే కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ నాయకులు రెడ్డి నారాయణరావు కోరారు. ఆదివారం లంకాపట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా బకాయిలు, ట్రూఅప్ ఛార్జీలు పేరుతో వసూలు చేస్తున్నారన్నారు.వేలాది కోట్లు రూపాయలు ప్రజలపై భారం మోపడం విడ్డూరంగాఉందన్నారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు అప్పలరాజురెడ్డి పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లిమర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన సాధ్యమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు.ఆదివారం నెల్లిమర్ల అమరవీరుల స్మారక భవనంలో రెండోరోజు రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగాయి.ఈ సందర్భంగా కార్మిక వర్గానికి పిలుపు- పని విధానం అన్న అంశంపై వెంకటేశ్వర్లు వివరించారు. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న పరిస్థితులను తెలియజేశారు. కార్మికులు దేశంలో హక్కులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పర్మినెంట్ కార్మికుల సంఖ్య రోజురోజుకి తగ్గిపోయి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్, రోజువారీ, ఫిక్స్‌టెర్మ్ ఎంప్లాయిమెంట్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. నెల్లిమర్ల జూట్‌మిల్ కార్మిక సంఘం అధ్యక్షుడు నామాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.గీత పాల్గొన్నారు.

కళారంగాన్ని కాపాడాలి

రాజాం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):కళారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని రంగస్థల కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాజాంలో కళా క్రియేషన్స్ ఆధ్వర్యంలో 75వ నెలవారి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. రంగస్థలకళాకారుడు గోకవలస కృష్ణమూర్తి మనమరాలు జర్మనీ నౌగట్ల రియాన్స్ కూచిపూడి కృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం యడ్ల గోపాలరావును జీఎంఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలోకళా క్రియేషన్స్ ప్రెసిడెంట్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, మానవతా అధ్యక్షులు అచ్యుత్‌కుమార్, జూనియూర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజి షణ్ముఖరావు పెంకి చైతన్యకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి పాల్గొన్నారు

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

దత్తిరాజేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకుతప్పనిసరిగా సమాచారం అందజేయాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, జడ్పీటీసీ రౌతురాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షురాలు వంగపండుఅలివేణి, వైస్ ఎంపీపీలు భమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో శివాజీ పాల్గొన్నారు.

రైతు నాయకుడు లక్ష్మంనాయుడు మృతి

రేగిడి, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): రేగిడికి చెందిన రైతుసంఘం నేత శాసుబిల్లి లక్ష్మంనాయుడు(97) ఆదివారం మృతిచెందారు. సాయన్నచానల్ నీటితీరువా, ఇతర రైతాంగ సమస్యలపై పోరాటం చేశారు. లక్ష్మంనాయుడు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుకు మేనమామ, మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడుకు వియ్యంకుడు. రేగిడి సర్పంచ్‌గా, ఆమదాలవలస కోఆపరేటివ్ సుగర్స్ డైరక్టర్‌గా పనిచేశారు. లక్ష్మంనాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

శ్రామిక సంఘం నేత అప్పారావు..

నెల్లిమర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపాంలో జూట్ మిల్లు శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు పతివాడ అప్పారావు ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జడ్పీటీసీ గేదెల సన్యాసినాయుడు అప్పారావు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు

విజయనగరం టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం నుంచి ఈనెల 16 వరకూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ తెలిపారు. ఆదివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలుఇచ్చిందన్నారు.ఏఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని ఈనేపథ్యంలో ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేసేలా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం పేరుతో కార్యక్రమాలను చేపడతామన్నారు.ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్లడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని చెప్పారు. పీఆర్సీ ప్రకటించాలని, ఐఆర్, డీఏలను విడుదల చేయాలని, పీఎఫ్, జీఎల్ఐ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, జి.లక్ష్మీనాయుడు, పి.మేరి, ఎస్.సూర్యనారాయణ, పి.వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

- స్నానం కోసం నాగావళి నదికి వెళ్లి విద్యార్థి మృతి



దుర్గా ప్రసాద్ (ఫైల్)

పాలకొండ/బూర్జ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం రోజున తోటి స్నేహితులతో ఈతకు ఓ విద్యార్థి వెళ్లి మృత్యువాతపడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం మేరకు. పాలకొండ బల్లంకివీధికి చెందిన సాసుబిల్లి దుర్గా ప్రసాద్ (19) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దుర్గాప్రసాద్‌తోపాటు ఐదుగురు స్నేహితులు కలిసి ఆదివారం శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభాం సమీపంలోని నాగావళి నదికి స్నానానికి వెళ్లారు. దుర్గాప్రసాద్‌కు ఈత కొట్టడం రాకపోవడంతో నదిలోకి వెళ్లి చిక్కుకుపోయాడు. మిగతా ఐదుగురు ఒడ్డుకు చేరుకుని గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో యువకులతోకలిసి మళ్లీ నదికి వెళ్లి దుర్గాప్రసాద్‌ను కాపాడే ప్రయత్నంచేశారు. బయటకు తీసుకువచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రవల్లిక సిబ్బందితో కలిసి ఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. మృతుడికి తండ్రి రాము, తల్లి భారతి, చెల్లెలు ఉన్నారు. తమ కుమారుడు మృతి చెందాడని తెలుసుకుని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి ..

వేపాడ,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠరాజపురం సమీపంలోని రైవాడ కాలువ కల్వర్టు వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు.స్థానికులు, ఎస్.కోట సీఐ అప్పలనాయుడు కథనంమేరకు..శనివారం వేకువజామున మూడు,నాలుగు గంటల ప్రాంతంలో ఈప్రమాదం జరిగిఉంటుంది. మృతుడి పూర్తివివరాలు, ఏ వాహనం ఢీకొట్టిందో అన్న విషయం తెలియరాలేదు.ఈ సంఘటనకు సంబంధించి దర్యాప్తుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలతో సమాచారం అందించాలని వల్లంపూడి పోలీసులకు సీఐ ఆదేశించారు. మృతుడి వివరాలు, ఏ వాహనం ఢీకొట్టిందో తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బైకిస్టు..

రామభద్రపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని జన్నివలస సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బైకిస్టు మృతి చెందినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..నేరెళ్లవలసకు చెందిన కుడుమూరు కన్నయ్యదొర (26) పని ముగించుకొని రామభద్రపురం నుంచి ఇంటికి బైకుపై వెళ్తుండగా జన్నివలస సమీపంలో బైకు విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం అటువైపు వాకింగ్‌కు వెళ్తున్న కొంతమంది గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. కన్నయ్యదొరకు భార్య భవానీతోపాటు పిల్లలు అజిత్‌కుమార్, సోను ఉన్నారు.కన్నయ్యదొర కూలి పనిచేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టానికి బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రైలులో గంజాయి స్వాధీనం



ఎస్.కోట: కిరండోల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలుచేస్తున్న పోలీసులు

ఎస్.కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట రైల్వేస్టేషన్‌నుంచి కొత్తవలస వైపు వెళ్తున్న కిరండోల్ రైలులో ఎస్పీఆదేశాల మేరకు కొత్తవలస,ఎస్.కోట, రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టుచేశారు. గంజాయి నిర్మూలనలో భాగంగా ఈకార్యక్రమం చేసినట్లు పోలీసులు తెలిపారు.

- విజయనగరం క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొత్తవలస రైల్వేస్టేషన్‌లో కిరండోల్- విశాఖ పాసింజర్ రైలులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద 1.133 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. తనిఖీలు చేపడుతున్న సమయంలో పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని ముందులమూరివానిపాలెం గ్రామానికి చెందిన తన్నీరు యేసుబాబు ఒడిశాలోని బీజా ప్రాంతం నుంచి బెంగళూరుకు తరలించేందుకు రవాణా చేస్తుండగా, తనిఖీల్లో పట్టుబడినట్టు చెప్పారు. డీజీపీ ఆదేశాలతో లోకల్ పోలీసు, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, ఈగల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తన్నీరు యేసుబాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గంట్యాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రామవరం వద్ద హైవేపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావివలసకు చెందిన ప్రత్తిగళ్ల సూర్యనారాయణ గాయపడ్డాడు.స్థానికుల కథనం మేరకు.. విజయనగరంలో పని ముగించుకుని సూర్యనారాయణ ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. హైవే దాటుతున్న సమయంలో విశాఖ నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో సూర్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం సూర్యనారాయణను విజయనగనం ఆసుపత్రికి తరలించారు.

320 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్

వేపాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో వేపాడ-సోంపురం రహదారిలో వల్లంపూడి సమీపంలో అక్రమంగా ఆటోపై తరలిస్తున్న 320 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ తెలిపారు.బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశామని చెప్పారు.కేసు నమోదు చేసి సోమవారం రెవెన్యూ అధికారులకు బియ్యాన్ని అప్పగిస్తామని తెలిపారు.

బొడ్డవరలో జిందాల్ నిర్వాసితుల నిరసన



మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసనతెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలో ఆదివారం జిందాల్ నిర్వాసితులు వినూత్నంగా నిరసన తెలిపారు. తమకు జిందాల్ యాజమాన్యం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుచేసి న్యాయం చేయాలని 43 రోజులుగా నాలుగుపంచాయతీల నిర్వాసితులు నిరసన తెలుపుతున్నారు. ఆదివారం రైతు సంఘ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో బొడ్డవర వద్ద మెడకు ఉరితాళ్లు తగిలించుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ 18 ఏళ్ల కిందట భూసేకరణచేసి తమ బతుకులు చిన్నాభిన్నం చేశారని, ఇప్పుడు తమను సంప్రదించకుండా వేరే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటున్నారని వాపోయారు. కలెక్టర్,ఎమ్మెల్యే చొరవ తీసుకొని కంపెనీతో మాట్లాడి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుచేయాలని కోరారు. తమ భూముల్లో వెంటనే పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి, భద్రత కల్పించాలని కోరారు.

విజయనగరంలో దేశభక్తి గీతాల పోటీలు

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్త అగ్రహారంలో రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో ఆదివారం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా అకాడమీప్రిన్సిపాల్ డాక్టరు మండపాక రవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల భక్తిగా అంకితభావంతో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సంగీత అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం

- మంత్రి సంధ్యారాణి
- వెంగళరాయసాగర్ నుంచి నీరు విడుదల

మక్కువ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. ఆదివారం శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు నుంచి ఖరీఫ్‌కు సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాలూరు నియోజకవర్గంలోని ఆంధ్ర, వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టుల్లో పూడికతీత, కాలువ గట్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.2కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో పనులు చేపట్టినట్లు చెప్పారు. వెంగళరాయ ప్రాజెక్టుకు రూ.63కోట్లు జైకా నిధులు మంజూరైనప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వలన పనులు జరగలేదన్నారు. జైకా నిధులు తిరిగి విడుదల చేయించేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పెండింగ్‌బిల్లులు చెల్లించి, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కాలువ లను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ ఆర్.అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మత్స గోదావరి, వైస్ ఛైర్మన్ పెంట సత్యం, శంబర పోలమాంబదేవాలయం కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతి, ఈఈ డీఎస్ ప్రసాద్, డీఈఈ డి.సురేష్, బొబ్బిలి డీఈఈ పి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 250 కుటుంబాలు



టీడీపీలో కొత్తగా చేరిన వారితో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం మోదుగ పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల నుంచి 200 కుటుంబాలు, కేశవ పంచాయతీ నుంచి 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. కేసలి పంచాయతీ వైస్ సర్పంచ్ పనస లక్ష్మణరావు, కొనిసి కృష్ణ, పట్లూరు చిన్నారావు, కొనిసి లక్ష్మణ, వెలుగు పొట్టయ్య, పంది అప్పారావు, పంది కృష్ణ తదితరులు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథకాల్లో అగ్రగామిగా ఉందని, చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పర్యాటకంపై నిర్లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

జగతిపల్లి కొండల వద్ద రిసార్ట్ అభివృద్ధి కోసం రూ.27 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉందని ప్రతిపాదనలు చేశారు. ఈ విధంగా ప్రభుత్వానికి వెళ్లిన ప్రతిపాదనలకు మోక్షం లేకపోవడంతో పర్యాటకంగా జిల్లా అభివృద్ధి మాటలకే పరిమితమైంది.

అభివృద్ధి చేయాలి

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కూడా జరగడం లేదు. ఏ రంగంలో కూడా జిల్లా అభివృద్ధి లేకపోతే జిల్లా ప్రజలకు ఉపాధి ఏ విధంగా లభిస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే ఎంతో మంచిది.

-శ్రీనివాసరావు, పార్వతీపురం

చర్యలు తీసుకోవాలి

ప్రతి జిల్లా ఏదో ఒక రంగంలో ముందంజలో ఉండాలి. కానీ, జిల్లాలో ఆ పరిస్థితి లేదు. పారిశ్రామికంగా ఎటువంటి అభివృద్ధి లేకపోవడంతో జిల్లా యువత ఉపాధి లేక వలసలు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు పర్యాటకంగా జిల్లాను పాలకులు అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

-ఎస్.అప్పలనాయుడు, కొమరాడ

ఉద్యమమే జీవితంగా.. పాటే ఊపిరిగా

(ఐదో పేజీ తరువాయి)

ఎంతో కీర్తిని తీసుకొచ్చాయి. ఈ పాటలు విప్లవ చైతన్యానికి గుర్తు నిలిచాయి. ఆయన రచించిన 30 పాటలు దేశంలో వివిధ భాషల్లోకి అనువదించబడ్డాయి. 'యంత్రమెట్ల నడుస్తుందంటే' పాట ఇంగ్లీష్‌లోకి అనువాదమైంది. ఈ పాట అంతర్జాతీయంగా వంగపండుకు మంచి గుర్తింపు తెచ్చింది.

- కమ్యూనిటీ ఉద్యమంలో వంగపండు చురుకుగా పాల్గొనేవారు. శ్రీకాకుళం ఉద్యమం ప్రభావంతో సామాజిక సమస్యలపై స్పందనగా రచనలు ప్రారంభించారు. ఆయన పాడారంటే పాట వెనుక ఉద్యమం స్ఫూర్తి ఉండేదని ఉద్యమకారులు చెప్పుకొనేవారు. ఆయన పాట కోసం వేచిచూసే పరిస్థితి జననాట్య మండలి ప్రదర్శనలో ఉండేది. 2008లో బొల్లిమంద శిరామకృష్ణ మెమోరియల్ అవార్డు, 2017లో కళారత్న అవార్డును వంగపండు పొందారు.
- 2020 ఆగస్టు 4న అనారోగ్యంతో పార్వతీపురంలోని తన స్వగృహంలో వంగపండు కన్నుమూశారు. ఆయన జ్ఞాపకంగా విగ్రహాలు ఏర్పాటు చేస్తామని, ఏదైనా శాశ్వత నిర్మాణం చేపడతామని అప్పటి పాలకులు చెప్పారు. కానీ, నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీనిపై వంగపండు అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

ఆయన జ్ఞాపకాలతో జీవిస్తున్నా..



నా భర్త అంటే నాకు ప్రాణం. ఆయన గజ్జెలు కట్టి పాట పాడి ఆడుతుంటే ఎంతో ఆనందంగా ఉండేది. నా ఆరోగ్యం బాగోలేకపోయినా, ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా.

-విజయలక్ష్మి, వంగపండు ప్రసాదరావు సతీమణి

శక్తియాప్‌తో మహిళలకు భద్రత



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం

బెలగాం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తియాప్ మహిళలకు భద్రత, రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని శక్తి టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. పార్వతీపురం శక్తి టీం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలోని పలు బాలికల వసతిగృహాలను సందర్శించి విద్యార్థినులకు మహిళా, ఫోక్సో చట్టాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళామణులందరూ శక్తి యాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకోవాలని శ్రీనివాస్ తెలిపారు. యాప్ రిజిస్ట్రేషన్ చేసి 11 ఫీచర్స్ ఉపయోగాలను వివరించారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌ను వినియోగిస్తే పోలీస్‌లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారని అన్నారు. అలాగే 112 శక్తి టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నెంబర్‌ని, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, విక్రయాలు గురించి తెలిస్తే 1972 నెంబర్‌ను సంప్రదించాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్న వారికి ఎల్లప్పుడూ గౌరవం

- ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):నిబద్ధత, క్రమశిక్షణ ఉన్నవారికి సమా జంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డ్ ఎంఈవో చల్లా లక్ష్మణరావును పాతబొబ్బిలి ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-2 అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అభిమానులు హాజర య్యారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ తాను ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు గాని, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్పుడు గాని లక్ష్మణరావు ఎక్కడా ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయడం చూశానన్నారు. ఆయనలోని స్థితప్రజ్ఞత చాలా గొప్పదని కొనియాడారు. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు మాట్లాడుతూ లక్ష్మణరావుకు ఏ పనులు అప్పగించినా సక్రమంగా సమర్థంగా నిర్వహించి మంచి పేరుగడించారని చెప్పా రు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, ఎంపీడీఓ రవికుమార్, డిప్యూటీ డీఈవో మోహనరావు, మన్యం జిల్లా రిటైర్డ్ డీఈవో ఎన్‌టి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు నామినేటెడ్ పదవులపై హర్షం

బొబ్బిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టరు పదవులను జనసేన పార్టీ నాయకులకు కూడా కేటాయించడం హర్షనీయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. బొబ్బిలి పట్టణానికి చెందిన లంక రమేష్‌ను, తెర్లాం మండలం పెరుమాలికి చెందిన సాకేటి గౌరిని ఏఎంసీ డైరెక్టర్లుగా నియమించినట్లు తెలిపారు. రామభద్రపురం గ్రామానికి చెందిన మహంతి ధనుంజయ్, బాడంగి మండలం పాల్తేరుకు చెందిన సీహెచ్ విద్యుల్లత, తెర్లాం మండలం పెరు మాలి గ్రామానికి చెందిన చాట్ల సింహాచలం, బొబ్బిలి మండలం కారాడ గ్రామానికి చెందిన జగన్మోహనరావును ఆయా మండలాల పీఏసీఎస్‌లకు డైరెక్టర్లుగా నియమించినట్లు పార్టీ అధిష్టానం నుంచి తమకు సమాచారం వచ్చిందని ఆయన తెలిపారు.

తేట తెలుగు శతకం పుస్తకం ఆవిష్కరణ

- హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బొబ్బిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రభుత్వ హైస్కూలు ఉపాధ్యాయుడు, సాహితీ కౌముది అధ్యక్షుడు చింతా రమణ రచించిన తేట తెలుగు శతకం పుస్తకాన్ని ఎమ్మెల్యే బేబీనాయన, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పీఆర్‌టీయూ నేత వాలేటి తవిటినాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ చింతా రమణ సాహిత్యరంగంలోనే కాక, విద్యారంగంలోనూ విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. గాడి తప్పుతున్న విద్యార్థిలోకంలో పరివర్తన రావాలన్న సత్సంకల్పంతో ఆయన పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా ఉంటూ విద్యార్థులందరికీ సాష్టాంగ నమస్కారం చేసిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన మైందన్నారు. ఎమ్మెల్సీ గాదె మాట్లాడుతూ చింతా రమణ సాహితీ, విద్యారంగంలో అందిస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతు రామ్మూర్తి, ఎంపీడీవో రవికుమార్, ప్రముఖ కవులు దాలినాయుడు, ఉమామహేశ్వరరావు, ఎంసీహెచ్ గౌరునాయుడు, రిటైర్డ్ ఎంఈఓ కేతిరెడ్డి కృష్ణమూర్తి, ముట్నూరు వేణుగోపాలరావు, తేలు వరప్రసాద్, రౌతు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, ఎమ్మెల్సీ గాదె తదితరులు

ఎంఎస్ఎంఈ పార్కు పేరుతో దౌర్జన్యం తగదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



ఆందోళన చేస్తున్న గిరిజనులతో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

రామభద్రపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలం నుంచి గిరిజనుల సాగులో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం పేరుతో గిరిజనులపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మి నేని సూర్యనారాయణ ప్రశ్నిం చారు. కాకర్లవలస, కారేడువలస గ్రామాలకు చెందిన గిరిజనులతో ఆదివారం ఆయన చర్చించారు. అధికార పార్టీ యంత్రాంగం దిగివచ్చే వరకు గిరిజనులకు సీపీఎం అండగా ఉంటుందని, ఎటువంటి నిరాశ చెందకుండా ఉద్యమం కొనసాగించాలని కోరారు. ఈ ప్రాంతంలో ఉన్న సాగు భూములన్నింటికీ పట్టాలు ఇచ్చేవరకు తాము గిరిజనులకు అండగా ఉంటామని తెలిపారు. గ్రామానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో రిజర్వు ఫారెస్టు భూములు కేటాయిస్తామనడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు.

తగ్గిన నిమ్మ ధర

- బస్తా కాయలు రూ.600



సీతంపేట సంతకు రైతులు తీసుకువచ్చిన నిమ్మకాయల బస్తాలు

సీతంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతులు పండించే నిమ్మ పంటకు మద్దతు ధర తగ్గింది. ఆదివారం సీతంపేట వారపుసంతలో 45కేజీల నిమ్మకాయల బస్తా రూ.600 పలికింది. గత వారంతో పోల్చుకుంటే రూ.150వరకు మద్దతు ధర తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వారం నిమ్మ ధర ఒక్కోలా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతలకు వచ్చే వ్యాపారులు అందరూ సిండికేట్‌గా మారి పంటకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

హిందూధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొన్న శ్రీనివాసనందస్వామి తదితరులు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మపరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకులు కె.రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీమద్భాగవత సప్తహ, సప్తమ నవకుండి గాయత్రీ మహాయజ్ఞాన్ని శ్రీనివాసనందస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గంలో ఎవరైయితే పయనిస్తారో వారికి మనశ్శాంతితో పాటు మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. ధర్మాన్ని మీరు రక్షిస్తే, ఆ ధర్మం మిమ్మల్ని కాపాడుతుందన్నారు. భాగవత సప్తహం అనేది మానవ జీవనగమనానికి దిక్సూచి వంటిదని అన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన శ్రీ సర్వమంగళాదేవి పీఠం వ్యవస్థాపకులు మురపాక కాళిదాసు శర్మ, హిందూధర్మ ప్రచారకులు, తదితరులు పాల్గొన్నారు.

సప్త సూర్య నమస్కారాలు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శ్రీసూర్యపీఠంలో ఆదివారం సప్త సూర్యనమస్కారాలు పీఠం నిర్వాహకులు వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో జరిగాయి. సూర్య భగవానునికి క్షీరాభిషే కాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వి.వివేకానంద శర్మ, జె.సూర్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అప్పలస్వామి



ఎన్నిక పత్రం అందుకుంటున్న అప్పలస్వామి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ గుమ్మ లక్ష్మీపురం మండల నూతన అధ్యక్షుడిగా కడ్రిక అప్పలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పలస్వామి దుమ్మంగి సర్పంచ్‌గా పని చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం ఎన్నిక కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా ట్రెజరర్ నడుకూరు ధూళికేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భాస్కరరావు, దివాకర్, నాయకులు దొరబాబు, ప్రసాద్, గౌతమ్, తిరుపతిరావు మాస్టార్, కుమార్, సతీష్, హరిష్, పాలక భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



పెద్దూరూ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహన దారులు ప్రమాదాలకు గురికా కుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ పి.రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామన్నారు. మద్యం తాగి వాహనం నడిపినట్లు గుర్తిస్తే అపరాధ రుసుం విధిస్తామని అన్నారు.

అన్నదాత సుఖీభవ పథకంపై హర్షం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు సత్యంనాయుడు తదితరులు

సీతానగరం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడంపై రైతులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మండల టీడీపీ నాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు అన్నారు. ఆదివారం జోగింపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన రైతులందరికీ సరైన సమయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏడాది పరిపాలనపై అన్ని వర్గాల్లో ఆనందం కనిపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.లక్ష్మణరావు, బలగ శ్రీనివాసరావు, అన్నంనాయుడు, అరవింద్, ఫైల నాగభూషణరావు, టి.రామా రావు, టి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తలవరం విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

వీరఘట్టం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తలవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం పార్వతీపురంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో వారు సత్తాచాటారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులు సంజన, పవిత్ర, హేమలతను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, యోగా గురువు జనార్దన్ అభినందించారు.

మాఫీ.. హ్యాపీ!

(ఐదో పేజీ తరువాయి)

తీరువా వసూలు చేయాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 2019 నుంచి దానిపై దృష్టి సారించడం లేదు. దీంతో ప్రాజెక్టులు అధ్వానంగా మారుతున్నాయి. పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కతో కాలువలన్నీ నిండిపోవడంతో శివారు భూములకు నీరందడం లేదు.

జమ కావడం లేదు..

నీటి తీరువా బకాయిలు వసూళ్లయితే ప్రాజెక్టుల పరిధిలో కాలువల పనులు చేసే అవకాశం ఉంది. వాటి పర్యవేక్షణకు అవసరమైన సిబ్బంది తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవచ్చు. కానీ కొన్నేళ్ల నుంచి రెవెన్యూశాఖ నుంచి నీటి పారుదలశాఖకు నిధులు జమ కావడం లేదు.

- ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నీటి పారుదలశాఖ, పార్వతీపురం మన్యం

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఐటీడీఏ అధికారులు తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవొచ్చునని సూచించారు. పీజీఆర్ఎస్‌లో పీవోతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కూలీలకు రైన్ కోట్లు వితరణ

జియ్యమ్మవలస, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కోలక నాగరాజు ఆధ్వర్యంలో 200 మంది కూలీలు, రైతులకు రైన్ కోట్లు ఆదివారం పంపిణీ చేశారు. అలమండ, జియ్యమ్మవలస పంచాయతీల పరిధిలో వరి నాట్లు వేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వాటిని అందించారు. సత్యసాయి బాబా ప్రసాదం, ఫొటోను కూడా అందజేశారు. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్ మోహన్, బొమ్మి పంచాయతీ నుంచి బడే వెంకటనాయుడు, జియ్యమ్మవలస ప్రశాంతి మందిరం సాయి భక్తులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగరవేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని అన్ని పంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఎగుర వేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 15 వరకు జాతీయ పతాకాన్ని ఎగుర వేసేలా కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయాల సిబ్బంది దృష్టి సారించాలని అన్నారు. హర్ ఘర్ తిరంగాపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని పెంపుదల చేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బుడగరాయి సమీపంలోని సారా తయారీ కేంద్రంపై ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600లీటర్ల పులిసిన బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

- సీతంపేట గ్రామంలోని మద్యం దుకాణానికి సమీపంలో ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై దాడి చేసి 10మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.